క్లుప్తంగా

నివాళి

కదిరి అర్బన్: మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సలీంబాషా (43) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మృతుడికి నివాళులు అర్పించారు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు స్పందన రద్దు

బత్తలపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి రావొద్దని సూచించారు.

క్రీడల్లో రాణించాలి



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం: కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, గుర్తింపు తీసుకురావాలని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మేరివరకుమారి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు ఆదినారాయణ, జూడో క్లబ్ కోచ్ ఇనాయత్‌బాషా సూచించారు. ఇటీవల చెన్నైలో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన విద్యార్థిని పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామానికి చెందిన శివకుమార్ పని నిమిత్తం ధర్మవరం పట్టణానికి ద్విచక్ర వాహనంలో వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఇందిరమ్మ కాలనీ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో.. స్థానికులు వెంటనే ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల

ధర్మవరం అర్బన్: ఉచిత గుండె వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, 29వ వార్డు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, వార్డు ఇన్‌చార్జ్ బాలిరెడ్డి తెలిపారు. పట్టణంలోని సుందరయ్యనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులతో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వంద మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకోగా.. మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రికి రావాలని 12 మందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రామ్‌కుమార్, ఆసుపత్రి ఏరియా మేనేజర్ షెక్షావలి, వైద్య బృందం, మాజీ కౌన్సిలర్ ఉడుముల రాము పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో ఆత్మీయులై..



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: పట్టణంలో ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆత్మబంధువులై అనాథ శవానికి అంత్యక్రియలు చేశారు. వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలో చిత్రావతి రోడ్డు సమీపంలో సాయి కైలాస్ అపార్ట్‌మెంట్‌లో సీసీ గుప్తా (94) పంజాబ్ రాష్ట్రం నుంచి సత్యసాయి భక్తుడిగా పుట్టపర్తికి వచ్చేసి ఇక్కడ స్థిరపడ్డాడు. ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. సమీప బంధువులు ఎవరూ లేకపోవడంతో అనాథ శవంగా గుర్తించి స్థానికులు, పోలీసులు ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ట్రస్టు సభ్యులు.. హిందూ సాంప్రదాయం ప్రకారం కర్ణాటకనాగేపల్లి శ్మశానవాటికలో సీసీ గుప్తాకు అంత్యక్రియలు నిర్వహించారు కార్యక్రమంలో సభ్యులు షామీర్, మాతంగి, షాకీర్, బాబ్జాన్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల పొద్దుతిరుగుడు

- సంకరజాతి పొద్దుతిరుగుడుతో ఆదాయం
- వినూత్న ప్రయోగాలతో పంటల సాగు
- ఎకరాకు 10 క్వింటాళ్ల వరకూ దిగుబడి
- క్వింటా రూ.13 నుంచి రూ.15 వేలు పలుకుతున్న ధరలు



గొల్లపల్లి వద్ద సాగు చేసిన సంకరజాతి పొద్దుతిరుగుడు

ఓడీ చెరువు: వరుస కరువుతో అల్లాడిపోతున్న రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో వాణిజ్య సంకరజాతి పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నియోజవర్గ వ్యాప్తంగా బోరుబావుల కింద ఈ ఏడాది రబీలో వాణిజ్య పంటలైన వేరుశనగ, మొక్కజొన్న పంటలతోపాటు సంకర జాతి వంగడాలైన పొద్దుతిరుగుడు విస్తారంగా సాగు చేశారు. ఓడీ చెరువు మండల పరిధిలోని వేమారెడ్డిపల్లి, వంచిరెడ్డిపల్లి, ఇనగలూరు, నందివారిపల్లి, జరికుంటపల్లి, శెట్టివారిపల్లి, దాదిరెడ్డిపల్లి, మద్దకవారిపల్లి, లింగాలవారిపల్లి, అమడగూరు మండలం మహమ్మదాబాద్, పత్రివాండ్లపల్లి, గొల్లపల్లి, కొట్టువారిపల్లి, జౌకల, కొలిమిరాళ్లపల్లి, నిలువురాతిపల్లి, జే.కే.పల్లి, కరిమిరెడ్డిపల్లి, గువ్వలపల్లి, గుండువారిపల్లి, అలాగే నల్లమాడ మండలంలో పులగంపల్లి, నల్లమాడ, గోపేపల్లి, చౌటకుంటపల్లి, ఎద్దువాండ్లపల్లి, మసకవంకపల్లి, దొన్నికోట తదితర గ్రామాల్లో సంకరజాతి వంగడం పొద్దుతిరుగుడు పంటను సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఓడీ చెరువు మండల వ్యాప్తంగా సుమారు 1,250 ఎకరాలు, అమడగూరు మండలంలో 950 ఎకరాలు, నల్లమాడ మండలంలో 650 ఎకరాలకు పైగా సంకరజాతి పొద్దుతిరుగుడు సాగు చేశారు. మెలుకువలు పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చని రైతన్నలు అంటున్నారు.

క్రాస్ (సంక్రమణ) విధానమే కీలకం

సంకర జాతి పొద్దుతిరుగుడు సాగులో క్రాస్ (సంక్రమణ) చేసే విధానమే కీలకం. క్రాస్ ఎంత బాగా చేస్తే అంత బాగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. పొద్దుతిరుగుడు సాగులో మేల్,ఫీమేల్ అనే రెండు రకాల విత్తనాన్ని వేరు వేరుగా సాగు చేయాలి. ఎకరా పొలంలో సంకరజాతి పొద్దుతిరుగుడు సాగు చేస్తే పది సెంట్లలో మేల్ రకాన్ని సాగు చేయాలి. పూత దశలో మేల్ రకం నుంచి పుప్పొడి రేణువులను ప్రతి రోజు ఉదయం సాయంత్రం వేళ డబ్బాల్లోకి డస్టర్ ద్వారా సేకరించాలి. సేకరించిన పుప్పొడిని చల్లని ప్రదేశంలో నిల్వ వుంచుకోవాలి. వారం తర్వాత ఫిమేల్ రకపు పొద్దుతిరుగుడు పుష్పాలకు దూది లేదా మెత్తడి బట్టతో ప్రతి పుష్పం చుట్టూ తుడిచి (క్రాస్) సంక్రమణం చేయాలి. ఇలా రోజు విడిచి రోజు సేకరించిన పుప్పడిని పుష్పాలకు పూయడంతో వాటి మధ్య సంపర్కం చెంది బలమైన నాణ్యమైన విత్తనం ఏర్పడుతుంది, ఇలా మూడు నుంచి ఐదు రోజులు పుష్పాలకు పుప్పొడిని పూయాలి. ఇలా చేస్తే పుష్పాల మధ్య సంపర్కం చెంది గింజ బలీయంగా తయారు అవుతుంది. ఎకరాకు కనీసం 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేంద్రియ ఎరువుల వైపే మొగ్గు

పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని రైతులు పూర్తిగా తగ్గించారు. వాటి స్థానంలో సేంద్రియ ఎరువులనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. దుక్కిలో పాడిపశువుల పెంటను ఎకరాకు మూడు నుంచి ఐదు టన్నులు వేసి బాగా దుక్కి చేస్తే మేలు. మంచి దిగుబడి ఇచ్చే రకాల ఎంపిక కీలకం.



డబ్బాలో సేకరించిన పుప్పొడి

ఆదాయం బాగుంది..



ఐదు ఎకరాల్లో నూజివీడు రకానికి చెందిన క్రాస్ పొద్దుతిరుగుడు పంట సాగు చేశా. మరో నెల రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు కనీసం 10 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. ఇది తక్కువ కాలంలో ఎక్కువ లాభం వచ్చే పంట. కేవలం వంద రోజుల్లో (మూడు నెలల్లో) పంట చేతికి వస్తుంది. కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.15 వేలతో కంపెనీ వారే పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తారు.

- గోపాల్‌రెడ్డి, గొల్లపల్లి, అమడగూరు మండలం

ఖర్చు తక్కువ



సీడ్స్ యాజమాన్యం ఇచ్చిన సూచనలు, సలహాలతో రెండు ఎకరాల్లో క్రాస్ పొద్దుతిరుగుడు పంట సాగు చేశాను. భూమిని బాగా దుక్కి చేసి పశువుల ఎరువులు వేశాం. విత్తనం వేసిన తర్వాత కలుపు తీత పనుల అనంతరం తక్షణం డీఏపీ, యూరియా ఎరువులు వేసి నీరు కడుతున్నాను. ఆ తర్వాత పువ్వులను క్రాస్ చేసేందుకు వారం రోజుల మాత్రమే కూలీలు అవసరం. ఏ పంటకూ ఇంత తక్కువ పెట్టుబడి ఉండదు. ఖర్చులన్నీ పోనూ ఎకరాకు కనీసం రూ.60 నుంచి 80 వేల వరకూ మిగులుతుంది.

- అమర్‌నాథ్ రెడ్డి, రైతు, గొల్లపల్లి

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని మారుతీపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శివకేశవరెడ్డి (45) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. మారుతీపురానికి చెందిన శివకేశవరెడ్డి పదిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గోవిందరెడ్డి , సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పార్టీకి విశేష సేవలు అందించిన శివకేశవ రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి , పార్టీ అన్నివిధాలుగా ఉండగా ఉంటుందన్నారు.

నేటి నుంచి ఖాశీంస్వామి చిన్న గంధం ఉత్సవాలు

బత్తలపల్లి: మండల కేంద్రంలో సోమవారం నుంచి రెండు రోజులు పాటు ఖాశీంస్వామి చిన్న గంధం ఉత్సవాలను హజరత్ హిమామ్ ఖాశీం చారిటబుల్ ట్రస్ట్, మత్తుం ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. 27వ తేదీ ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం, హజరత్ హిమామ్ ఖాశీం చారిటబుల్ ట్రస్ట్ తరపున ఉచిత అంబులెన్స్ సర్వీసు ప్రారంభిస్తామన్నారు. రక్తదానం చేసేవారికి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఏడాది పాటు రూ.50 వేలు హెల్త్ ఇన్సూరెన్స్, ఏడాది అత్యవసర పరిస్థితులకు (చికిత్స కోసం) రూ.10 వేలు మెడికల్ సర్వీసు ఇవ్వబడుతుందన్నారు. రాత్రి 8 గంటలకు వంద మంది ఫకీర్‌లతో బీజాపూర్, కంప్లీ డ్రమ్స్ షా బన్వాష జలాల్ ఉంటుందన్నారు. మంగళవారం 10 గంటల నుంచి అల్లా పేరుతో విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలి

పుట్టపర్తి: నియోజకవర్గంలో ప్రతి డీలర్ అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ పారదర్శకంగా పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీరి గెలుపు పార్టీకి ఎంతో ముఖ్యమన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పచ్చ పత్రికను బహిష్కరించాలి

ధర్మవరం: తప్పుడు వార్తలను ప్రచురిస్తున్న ఈనాడు దినపత్రికను ప్రతి ఒక్కరూ బహిష్కరించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం తెలిపారు. పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో ఆదివారం వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటు పత్రికా విలువలను కాలరాస్తూ ప్రజాస్వామ్యాన్ని మంట కలుపుతోందన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. ఈనాడు దినపత్రికను స్వచ్ఛందంగా బహిష్కరించాలన్నారు. ఈనాడు రామోజీరావు ఇక నుంచి అయినా బుద్ధి తెచ్చుకుని, తప్పుడు రాతలు రాయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి అల్లాడి ప్రవీణ్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి అంజి, విద్యార్థి విభాగం నాయకులు మహమ్మద్ వలి, శివ, నవీన్, రఫి, కార్తీక్, పతి, సాయి, బాషా, సంతోష్, ప్రశాంత్, తేజ, హరి, అనిల్, వెంకటేష్, మణి, సోషల్ మీడియా రాజశేఖర్, ప్రవీణ్, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడి ఎంపికపై హర్షం

ఓడీ చెరువు: వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన ముక్తాపురం జగన్‌మోహన్‌రెడ్డిని నియమించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి మలక అశ్వర్థరెడ్డి తదితరులు మాట్లాడారు. గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారులు సత్వరమే పరిష్కరించని పక్షంలో జిల్లా అధ్యక్షులు వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయవచ్చని పేర్కొన్నారు. ఎంపికకు కృషి చేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గంగులప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల బాబా,నాయకులు మల్లూరి క్రిష్టారెడ్డి,మహేశ్వర్‌రెడ్డి,ప్రభాకర్ నాయుడు, మునెప్ప, ఖాజుద్దీన్,ఆదినారాయణ, ఎల్ఐసీ గోవిందరెడ్డి,ఇద్దే క్రిష్టారెడ్డి,నరసింహులు, న రసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నిబంధనల మేరకే ఇసుక తవ్వకాలు

ధర్మవరం: రాజకీయ ఉనికి కోసం ఎదుటి వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం.. బురదజల్లడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందని తాడిమర్రి ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ముదిగుబ్బ మండల నాయకుడు ఇందుకూరు నారాయణరెడ్డి, బత్తలపల్లి మండల నాయకుడు డీచెర్లోపల్లి కృష్ణ ధ్వజమెత్తారు. ఆదివారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పారదర్శకంగా ఇసుక రీచ్‌లను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇసుక రీచ్‌లతో తమకు ఏ సంబంధం లేకున్నా ఆరోపణలు చేస్తున్న పరిటాల శ్రీరామ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ముదిగుబ్బ మండలంలో ఉన్న ఇసుక రీచ్ జేపీ పవర్ వెంచర్స్ కంపెనీ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కంపెనీ చెన్నైకు చెందిందన్నారు. ఇందులో ఇసుక తవ్వకాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిఘా వేసి అధికారులతో తనిఖీలు చేస్తూ పక్కా పారదర్శకంగా చేపడుతోందన్నారు. ఇటీవల ఎల్లో మీడియా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఇసుక రీచ్‌ల పట్ల ఆరోపణలు చేస్తూ ఇసుక రీచ్ పరిసర ప్రాంత రైతులకు అపోహలు సృష్టించడం జరుగుతోందన్నారు. టీడీపీ వారు ఆరోపించిన విధంగా పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు ఎక్కడా జరగడం లేదన్నారు. ప్రభుత్వంపై బురదజల్లి లబ్ధి పొందాలన్న కాంక్షతోనే ఎల్లో మీడియాలో తప్పుడు రాతలు రాయిస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో ఇసుకను బెంగళూరు వంటి నగరాలకు అమ్మి కోట్లాది రూపాయలు సంపాదించింది మీరు కాదా అని ప్రశ్నించారు. కుటుంబ పాలనతో రాప్తాడు ప్రజలు విసిగిపోయారన్నారు. ఇప్పటికైన నిజాలు తెలుసుకుని ఆరోపణలు చేయాలని లేదంటే తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



ఆధారాలను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

1,400 మందికి వైద్య చికిత్సలు



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న దుద్దుకుంట అపర్ణరెడ్డి

అమడగూరు: మండలంలోని చౌడేశ్వరీ కల్యాణ మండపంలో ఆదివారం రెండో రోజు దుద్దుకుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 1,400 మందికి వైద్య పరీక్షలు చేశారు. దుద్దుకుంట ఫౌండేషన్ చైర్‌పర్సన్ దుద్దుకుంట అపర్ణరెడ్డి వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్ల అద్దాలు, మందులు పంపిణీ చేశారు. అలాగే 320 మందికి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. రోగులకు భోజన వసతి కల్పించారు. రెండు రోజుల వైద్య శిబిరంలో మొత్తం 2,442 మందికి వైద్య చికిత్సలు అందించినట్లు పీస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బొగ్గు సురేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కడగుట్ట కవిత, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, సరస్వతమ్మ, నరసమ్మ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోనున్న శ్రీ మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం స్వామి జన్మదిన వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూలంకరణ చేసి పూజలు చేపట్టారు.

పెద్దమ్మ ఆలయంలో..

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ దేవత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పూజారి బండారు దేవమ్మ అమ్మవారి విగ్రహానికి వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించారు. మహిళలు కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకోండి

నల్లమాడ: అర్హులైన ప్రతి ఒక్కరూ పక్కా గృహం నిర్మించుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, నాయకుడు అంజినాయక్ పేర్కొన్నారు. ఆదివారం హౌసింగ్ ఇంజినీర్ వరుణ్‌తో కలిసి ఆర్.రామాపురంలో 40 మందికి సిమెంట్ బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో మండలానికి మొదటి విడతలో నాలుగు వేలకు పైగా పక్కా గృహాలు మంజూరైనట్లు తెలిపారు. మరిన్ని పక్కాగృహాలు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారన్నారు. గృహ నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇటుకులు, ఇసుక, తీర్లు అన్నింటినీ ప్రభుత్వమే అందిస్తోందన్నారు. హౌసింగ్ ఏఈ వరుణ్ మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు 323 మందికి బేస్‌మెంట్ బిల్లులు, ఆరు మందికి రూఫ్ లెవల్ (మూత) బిల్లులు మంజూరైనట్లు తెలియజేశారు.



లబ్ధిదారులకు సిమెంట్ బస్తాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా ఆర్ఎస్ఎస్ వార్షికోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కొత్తపేట, రామ్‌నగర్ పురవీధుల్లో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు పద సంచాలన్ (ర్యాలీ) చేసి పాఠశాల ఆవరణలో యోగా, దండ ప్రయోగాలు, వ్యాయామ్‌యోగ్ తదితర ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ అశోక్ మాట్లాడుతూ.. మన జాతి భారత జాతి నిర్వీర్యమైన జాతికాదు, ఘనమైన కీర్తి, పౌరుషం, చరిత్ర, పరాక్రమమైన జాతి అని ప్రపంచానికి ఏనాడో తెలియజేసిందన్నారు. సమాజంలో అన్ని వర్గాలకు సంఘం సిద్ధాంతాలు చేరాలి తద్వారా సర్వత్ ముఖాభివృద్ధి ఈ దేశం చెందాలన్నారు. కార్యక్రమంలో ఖండ ప్రచార ప్రముఖ్ అన్నం అరవింద్, ఖండ కార్యవాహ్ శరత్‌బాబు, మణిశంకర్, రంగనాథ్, నరేష్, రెడ్డప్ప, నరసప్ప, స్వయం సేవకులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఆర్ఎస్ఎస్ సేవకులు

ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలి

పుట్టపర్తి టౌన్: వడ్డెర్లు ఐకమత్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిఆరామంలో వడ్డెర్ల జిల్లా ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డెర్లకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ వెనుకబడిన తనం పోలేదన్నారు. రాజకీయంగా కొంత మంది ఎదిగినప్పటికీ వడ్డెర్ల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. వడ్డెర్లు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉన్నత చదువులు చదివించాలన్నారు. భవిష్యత్‌లో వడ్డెర్లలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. హిందూపురం పార్లమెంట్ పరిధిలో అధిక సంఖ్యలో వడ్డెర్లు ఉన్నారని. పుట్టపర్తి అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ స్థానం వడ్డెర్లకు కేటాయించాలని కోరారు. వడ్డెర్లు ఐక్యతగా ఉండి వారిని గెలిపించుకొనే సత్తా ఉందన్నారు. జనం బలం ఉండి కూడా అభివృద్ధి కాలేక పోతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణప్ప, తిరుపాల్, పెద్దన్న, శ్రీరాములు, తిరుపతేంద్ర, కుళ్లాయప్ప, జయచంద్ర, రేపలముని, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

5న కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కంటిచూపు తగ్గినవారు సద్వినియోగం చేసుకోవాలని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాస్, క్యాంపు చైర్మన్ చాంద్‌బాషా తెలిపారు. ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. మార్చి 5వ తేదిన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కర్నూలుకు చెందిన శ్రీ చక్ర ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పోలా ప్రభాకర్, నామాల శీన, వాసుదేవుడు, కుమారస్వామి, బండి నాగేంద్ర, జయరాం పాల్గొన్నారు.

పర్యావరణ హితమే ధ్యేయం

సోమందేపల్లి: ముంబాయికు చెందిన ఏడుగురు పర్యావరణ ప్రేమికులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ కశ్మీర్ నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఆదివారం సాయంత్రం వారు సోమందేపల్లికు చేరుకున్నారు. మురాడే, దేశ్‌ముఖ్ మాట్లాడుతూ సైకిల్ వినియోగం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. ఫిబ్రవరి 5న కశ్మీర్‌లో తమ యాత్ర ప్రారంభం కాగా 3,500 కి.మీ. కొనసాగుతుందన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత హిందూపురం

హిందూపురం టౌన్: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాల మైదానంలో యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నెవర్ ఎండ్ గోలి సోడా ప్రతినిధుల సహకారంతో జిల్లా స్థాయి 7ఏ సైడ్ అండర్-12 మిక్స్‌డ్ జెండర్, అండర్-13 బాలుర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. అండర్-12 మిక్స్‌డ్ జెండర్ పోటీల్లో హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ విజేతగా నిలవగా, రెండో స్థానంలో పూలమతి ఎఫ్‌సీ, మూడో స్థానంలో హిందూపురం టౌన్ ఎఫ్‌సీలు నిలిచాయి. అలాగే అండర్-13 బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో మడకశిర ఎఫ్‌సీ విజేతగా నిలవగా, పరిగి సౌత్ ఎఫ్‌సీ రెండవ స్థానంలో, గుత్తి ఆర్ఎస్ ఎఫ్‌సీ మూడవ స్థానంలో నిలిచాయి. ఆర్‌డీటీ మేనేజర్ దాదా ఖలందర్, టెన్నిస్ కోఆర్డినేటర్ విశాల్‌కుమార్, నెవర్ ఎండ్ గోలీ సోడా డిస్ట్రిబ్యూటర్ విజయ్‌కుమార్ బహుమతులు అందించారు.